"ఏందిరో సైదులూ! ఈయాల సీకటి పడకుండానే ఇంటికెళ్ళిపోతున్నావ్"—రస్తాలోనే జానయ్య రుకాయించాడు.

ఊఁ .... కి .... నే—! సైదులు ముభావంగా పలికేడు.

మరదలు పిల్లగాని వచ్చినా దేంటి ?

లే .... దు.

గట్ట నయితే అనసూరి నిన్ను యాదు చేస్తుంటుందిలే .... !

గట్లాగని .... ?

జరా సీకటి పడేటెంకి—!

మనిషి పెద్దోడి వయినా నీ బుద్ధి యింకా మారలేదు—సైదులు చిరుకోపం ప్రదర్శించాడు.

పాపం! నువ్వు సానా బుద్ధిమంతుడివిలే .... !

అంటూ జానయ్య చేలగట్లు కడ్డంపడ్డాడు. కీచురువ్వుల సద్దు అంతకంతకీ దూరమవుతోంది. సైదులు భావనాప్రపంచంలో ముందడుగు వేశాడు. తన చేలలో పడి మేస్తున్న గొడ్లని చూసి జానయ్య ఎలుగెత్తి పొలికేక వేస్తున్నాడు. చేలకి నీళ్లొడుతున్న మట్టయ్య మోట బావి నుంచి కరకర మనే చప్పుడు గాలిలో తేలుతూ వస్తోంది. కళ్ళె లేరుకోవటం పూర్తయిన గమళ్లోళ్ల గంగమ్మ మెల్లగా బాట ద్రొక్కింది. ఆకాశాన పక్షులు బారులు బారులుగా తమ తమ నెలవులవంక ఎగిరిపోతున్నాయి. చక్కగా, చల్లగా వస్తున్న పిల్ల వాయువులు అతనికెందుకో విషవాయువుల్లా గున్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసలు బరువుగా సాగుతున్నాయి. సూటిగా ముఖంమీద ప్రసరిస్తున్న అరుణాస్తమయ కిరణాలు అతని ముఖంలోని కళాకాంతులుని వెనక్కి గుంజుకొని పోతున్నాయి. సంధ్యాచీకటి క్రమక్రమంగా సామాన్య చీకటిలా అలముకొంటోంది. కెనాలు కట్ట దాటి కంపాసాగరం బాట పట్టేడు. మేతకి పోయిన గొడ్లన్నీ మందలు మందలుగా కమ్ముకుంటో, పోట్లాడుకుంటో ఇళ్లకి చేరుకుంటున్నాయి. తను నడిచే బాటలాటిదే తన జీవితం కూడా అని తొలిసారిగా వేదాంతాన్ని వల్లె వేశాడు. ఆ బాట ఇనుకపర్ర. ఇరువైపులా ముళ్ల కంపలు. పరిసరాలని గుర్తించుకొని, పరిస్థితులని అవగాహన చేసుకొని ఏకలక్ష్యంతో సాగిపోయే మానవుడికి ఏ ప్రమాదమూ లేదు. నిర్లక్ష్యంతో ని ప్రక్కకి వాలినా, సోలినా, తూలినా వాడి ముళ్ళు రక్తంతో దప్పిక తీర్చుకొంటాయి. అడ ఒక సింతసెట్టు ఉంది. ఆ సింతసెట్టు చల్లని నీడలో రెండు సమాధులు నిద్రపోతూ ఉంటాయి. ఆ సింతసెట్టు కాడనుండి సైదులు కాళ్ళు ముందుకు కదలలేదు. నడుస్తున్న గడుస్తున్న జగన్నాటకంలో లీనమై మానవులు తాత్కాలికంగా తమ పాత్రల ప్రమేయాన్ని మరచిపోతారు. చివరికి జీవితంలో మిగిలే దేమిటి? అదృష్టవంతుల స్మృతి చిహ్నంగా ఆ సమాధులయినా మిగులుతాయి. పాతగాధలు పునశ్చరణ చేస్తాయి. మిగిలినవారి నామరూపాలు పుట్టిన మట్టిలోనే మిళితమైపోతాయి. కిష్టయ్య త్రాగుబోతు. గూండా. విలువయిన కాలాన్ని పత్తాలాడటానికే వినియోగించేవాడు. పరిహాసిస్తున్న లోకులకు తను అందుకొంటున్న, పొందుతున్న ఆనందానికి అనర్హులుగా, అప్రయోజకులుగా పరికించేవాడు. దుర్గయ్య సత్తెకాలపు మనిషి. మాయమర్మాలు తెలియనివాడు. ఇద్దరూ విభిన్న తరహాల వ్యక్తులు. అయినా ఇద్దరినీ మృత్యువు ఒకేసారి పెనవేసుకొంది. మరునాడే రెండు సమాధులు వెలిశాయి. మంచి చెడుల మచ్చుతునక లవి. చీకటి, వెలుగుల చిహ్నాలు. కష్టసుఖాల తోడునీడలు. ఆ సమాధులున్న తావే శ్మశానం. అక్కడ ఇంకా ఎన్నెన్నో పీనుగుల పెంటలున్నాయి. సగం కాలిన కట్టెలు శిధిలావస్థలోని మానవుల్లా గున్నాయి. పగిలిన కుండ పెంకులు రగులుతున్న దిగులుని రేకెత్తిస్తున్నాయి. రేపీ పొటికి ఇక్కడ తన సమాధి నిలుస్తుంది. గ్రామస్థులు రోజా చూస్తో క్షణంలో సైదులనే వ్యక్తిని మరిచిపోతారు. కొత్తగా చూసిన పాంధులు సానుభూతి ప్రదర్శిస్తారు. ఎందుకో సైదులు భయంతో గజగజ వణికిపోయాడు. ఆకాశం నుంచి చీకటి తెరలు చీల్చుకు వచ్చాయి. యాంత్రికంగా బాట పట్టేడు. ఊరు సమీపిస్తోంది. సైదులు ఎదలోని దిగులు సాగలా పైకి వ్యాపిస్తోంది. రేపు తనకి యీ పాతిక సంవత్సరాల నుంచి పుట్టి, పెరుగుతున్న వూరు కనిపించదు. రేపు తను ఎక్కడ ఉంటాడు?—తనకే తెలియని ప్రశ్న అది. మసక చీకటిలో ఏదో ఆకారం అతనికి ముందుగా మెదులుతోంది. భయమెరుగని సైదులు హృదయం చలించిపోయింది. అక్కడే నిలబడిపోయాడు. రోజా తనింటికాడ పండే పల్లికుక్క తోకాడిస్తూ వచ్చింది. రోజా కుక్క తన కెదురు వస్తుంది. తను తినగా మిగిలిన పట్టెడన్నంతో పెరుగుతూ, తన స్వామిభక్తిని పెంపొందించుకుంటోంది. వస్తోందా కుక్క. రోజా దానిని గోముగా నిమిరేవాడు. మనసు ఉల్లాసంగా ఉన్నప్పుడు దానిని ఈలపాటతో మైమరపించేవాడు. ఈనా డెందుకో ఆ కుక్కమీద చీత్కారం కలిగింది. తోకాడిస్తూ వచ్చే ఆ విశ్వాసజీవి ఆనందంతో ఇచ్చే సుస్వాగతం కాదది. రానున్న తన వీడ్కోలుకి సూచనగా భ్రమించాడు. అమందానందంలో కుక్క మీదికి ఎగబడింది. దానిని తన్నేడు. అతను తిన్నగా బీబమ్మ ఒటేలుకాడికెళ్లి బల్లమీద చతికిల పడ్డాడు.

ఈయాల సీకటి పడగానే వచ్చేసినావ్. బాగా పుర్సత్ దొరికినట్లుండాది—! బీబమ్మ పాన్‌లోకి అడకత్తెరతో ఛాలియా కత్తిరిస్తూ అంది.

లే దొదినా .... ! సైదులు నిట్టూర్చాడు.

బీబమ్మ తన పనిలో నిమగ్న మయింది.

చాయ్ ఉందా వొదినా .... ! సైదులు పరధ్యానంగా అడిగేడు.

ఏందీ .... ? ఆశ్చర్యంతో బీబమ్మ చేతిలోని అడకత్తెర పర్తాల్ చేసింది.

చాయంటున్నా ....

సజ్జ సంకటి తాగలేదా ? బీబమ్మ ఆశ్చర్యం నుంచి తేరుకుంటో అడిగింది.

లే దొదినా! ఈయే లెందుకో పరేసాన్‌గా ఉంది. సానం గుంజుతున్నాది. మన సేదనో ఉందినే నింక బతకను.

యా అల్లా! గట్లా మాట్లాడకు — బీబమ్మ నోరు నొక్కుకొంది.

సైదులు మాట్లాడలేదు. మాటలు రావటం లేదు.

బీబమ్మ చాయి తేవటానికి లోని కెళ్లింది.

సైదులు అలాగే కూర్చొని ఉన్నాడు. చీకటి బాగా ముసురుకుంటోంది. అడపా దడపా కర్షకులు ఇళ్లకి పోతున్న అడుగులచప్పుళ్ళు వినపడుతున్నాయి. ఎదురుగా ఉన్న తాటాకింటిలోని ఎక్కా (దీపం) గాజు మూ సె (కిరసనాయిలు) తక్కువై కాంతిలో దిగజారిపోతో మరల వెలుగుతోంది. సైదులు చాయి తాగి జేబులోని దో అణా పైసలు బీబమ్మ కిచ్చి, చుట్ట ముట్టించి లేచాడు. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్లు తేలిపోతున్నాయి. ఒళ్లు గజగజ వణికిపోతోంది. ఈరోజా తనకి చరమదినం. తన పాతికేళ్ల జీవితంలోని అనుభవాలకి, ఆనందాలకి అంతిమదినం. అసలు మల్లి ఎవరు .... ? ఎక్కడో పుట్టింది. మరెక్కడో పెరిగింది. ఒక తల్లి కడుపున పుట్టి — తల్లిదండ్రుల రూపురేఖలని కొల్లగొట్టి, తన జీవన పథంమీద అడుగుపెట్టి—ఎదురుగా వచ్చి చేయూత నిచ్చిన అర్ధాంగి. తలవనితలంపుగా తమిద్దరినీ కలిపిన విధాతే యీనాడు జీవితంలోని ఆఖరి రోజునకూడా అంతిమవీక్షణం చేసుకోకుండా ఎడబాటు కలిగిస్తున్నాడు. తనువులే అశాశ్వతములయిన యీ ప్రపంచంలో ఏది నిత్యం .... ?—ఏది సత్యం .... ? — ఎవరు బంధువులు ???

సైదులు నడుస్తున్నాడు. నాటకంలోని విషాద సన్నివేశంలోని కథానాయకునిలా అడుగులు వేస్తున్నాడు. పరిచయస్థులయిన వయోభేదాలలోని పండుముదుసలులు, పనివారలు, పసిపిల్లలు ఎదురుపడి, పలకరించి, మళ్లా పరేసాన్‌లో ముంచి పారిపోతున్నారు. ప్రపంచంలోను, ప్రజలలోను పాతిపోయే ఈ వ్యక్తులు మృత్యుదేవత ఉక్కు పిడికిలినుంచి జారిపోగలరా? సైదులు, అనసూరి ఇంటివరకు వచ్చేడు. ఆ సందుమలుపు తిరిగితే తన ఇల్లు. అంటే రేపటినుంచి మల్లి ఇల్లు. తలుపులు మూసిఉన్న ఇంటిలోని అనసూరి ఒక్కసారిగా అతని హృదయంలో ప్రత్యక్షమయింది. తమ దొరల్లా ఉంటాడట. బుద్ధిలో బృహస్పతివంటివాడుట. తనే చదువుకొని ఉంటే దొరలు తిరిగే మోటారు, సలాములు కొట్టే చప్రాసీలు, రాజసౌధంవంటి పెద్ద బంగళా, దాని ముందు నందనోద్యానవనం లాంటి పూలతోట—అన్నీ తన సొత్తేనట. అనసూరి ఎంత సక్కగా మాట్లాడుతాది—? తన పెళ్లి కాని క్రితం అనసూరి వలపు వెన్నెల్లో, కొంగ్రొత్త సోయగంలో మెరిసిపోయేదు. అనసూరికి తనంటే పంచప్రాణాలు. ఒకరోజు పొద్దుటేల తను సజ్జ చేలికాడికి వెళ్లేడు. అంతక్రితమే చూపులతోనే హృదయాన్ని విప్పి తనకి సమర్పించిన అనసూరి

46—వ పేజీ చూడండి

తెలుగు పత్రికలన్నిటిలో 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' సర్క్యులేషన్ అధికమైనది

చింతలూ చీకాకులతో జీర్ణశక్తి దెబ్బతింటుంది



మన దేహంలో, ఉదరకోశంనుంచి మెదడుకుపోయే నరాలు కొన్ని ఉంటాయి. చింతలతో, ఉద్రేకంతో బుర్ర వేడెక్కినప్పుడల్లా ఈ నరాలు, జీర్ణకోశం పనిచేయకుండా బిగబట్టి, రక్తనాళాలలో ఎడ్రినాలిన్ వంటి రసాయనిక ద్రవ్యాలను గుమ్మరిస్తాయి. ఎప్పుడూ పనిచేస్తూవుండే వాళ్లకి ఇది ఉపకరించినా, కాయకష్టం తక్కువైనవారికి మాత్రం ఇందువల్ల జీర్ణశక్తి ధ్వంసం అవుతుంది. వ్యాపారస్థులలో మాటికి అరవై మంది అజీర్తితో బాధపడడానికి ఇదే కారణం. ఏమైనా తినగానే నొప్పి వస్తుంది.

హ్యూలెట్స్ మిక్స్చర్ తీసుకుంటే నొప్పి వెంటనే తగ్గుతుంది. బాగా గుణం ఇస్తుంది. ఉదరకోశం లోపలివైపున ఇది కవచంలా కమ్ముకుంటుంది. కడుపులో మంట కలిగించే రసాయనిక ద్రవ్యాల తీవ్రతను అణచివేస్తుంది. ఆహారం చక్కగా కరిగి అరిగిపోవడానికి తోడ్పడుతుంది. 80 సంవత్సరాలుగా వైద్యులు దీనిని సిఫార్సు చేస్తున్నారు. పిల్లల అజీర్తికికూడా హ్యూలెట్స్ మిక్స్చర్ దివ్యంగా పనిచేస్తుంది.
అజీర్ణ విరేచనాలకు నల్లమందు కలిసిన హ్యూలెట్స్ మిక్స్చర్ వాడండి.

"హ్యూలెట్స్ మిక్స్చర్

పుచ్చుకోవడం మొదలుపెట్టినప్పటినుంచీ నేను శుభ్రంగా భోజనం చేయగలుగుతున్నాను."



సి. జె. హ్యూలెట్ & సన్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, 86/ఎ. సైనియప్ప నాయక్ వీధి, మద్రాసు - 3.

మూడవ సమాధి

17-వ పేజీ తరువాయి

కొడవలి, గడ్డిబుట్ట తీసుకొని వచ్చింది. తను మోట పలుగు పేనుతున్నాడు. వెనకాలవే వచ్చి కళ్ళు మూసింది.

అమ్మ దొంగా .... ! అంటూ చెయ్యి గట్టిగా ఒత్తేడు.

అబ్బో .... ! అంటూ పట్టు వదిలింది.

ఇద్దరూ వచ్చిగడ్డిమీద కూచున్నారు. అనసూరి తన ఒడిలో తలపెట్టి :

"నిన్ను సూత్తుంటే ఆ సినిమాలో హీరో యాదుకొత్తున్నాడు సైదులూ .... !"

"మరిగంత గట్టా మాట్టాడకు .... !" తను మందలించాడు.

"గెట్టా .... ?" అమాయకంగా చూసింది.

"గిట్టా .... !" అని ఆమెని తన బాహుపంజరంలో బంధించేడు.

సూరి వారించలేదు. అవి కొన్ని క్షణాలే. కాని .... అవి ఆనాటి తన జీవితంలోని మరువలేని, మరవురాని, మరిపించలేని, మెరపువంటి మధుర క్షణాలు. అప్పుడు తను మన్మథుడు. ఆమె రతి. ఆమె రాధ. తను మాధవుడు. ఆ వచ్చగడ్డే నంద కిశోరుని నిలయమైన బృందావనం. అదే తమని ఆశీర్వదించిన ఏకైక సాక్షి. అనసూరికి తన చిన్నతనంలోనే పెళ్ళయింది. యవ్వనంలోనే ఆమె భర్త తనువు చాలించేడు. తాళికట్టిన భర్తయొక్క ముఖమయినా సరిగా పరిశీలించలేకపోయిన బాల్య వితంతువామె. బావికిందనున్న నాలుగెకరాల తరితో బ్రతుకు వెళ్లదీస్తున్న ఏకాకి. తనకి మల్లితో లగ్నమవుతుంటే ఆ రోజల్లా సూరి ఇంటిలో కూర్చొని ఏడ్చిందట. మరునాడు తను సూరింటికి వెళ్లేడు.

"ఏంది బావా....!" సూరి దుఃఖాన్ని దిగమింగుకొంటూ అడిగింది.

"నీకు నామీద కోపం రావటంలేదా ?" సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ అడిగేడు.

"ఎందుకు ...... ?"

ఆ ప్రశ్న తన వ్యక్తిత్వానికే ఒక సవాలనిపించింది. సమాధానంలేని ఆ ప్రశ్న తన ఆత్మలో బల్లెంలా గ్రుచ్చుకొంది. ఒక స్త్రీలోని, ముఖ్యంగా అనసూరిలోని సహనశక్తిని తొలిసారిగా చవిచూడగలిగే డతను. హృదయ మొక్క విభిన్న దృక్పథాల సనమయితే, అందులో పశ్చాత్తాపం దావానలంలా నాలికలు చాచుకుంటూ ఎగబడుతోంది.

"నేను నీకు సానా దోహం చేశా సూరీ ! నావంటి పాపి యీ పెపంచంలో బతకకూడదు. నీలాయింకా యీ పెపంచంలో ఎంతమంది మోసపోతున్నారో .... ! నన్ను సంపెయ్యి సూరీ ! బతికుండి యీ జీవితంలో సుఖమనుభవించలేను — నీ కాళ్లముందు ఆనందంగా సానా తొదులుతాను !" విద్యార్థి పాఠ మప్పగించినట్లు గబగబ అనేశాడు.

"తప్పు బావా! నీ సూరికి సొర్థం లేదు. నాకు కావలసిం దొకటే. నీ సుఖమే నాకు కావాలి. తం

సూరిని .... మరచిపోతావా బావా ....” కళ్ల నీళ్లు తిరిగేయి.

“నా మల్లి తోడుగా నిన్ను మరువను సూరీ....!”

“నీకు నామీద దయ ఉంటే నా ఇంటి దర్వాజా ఎప్పుడూ తెరుచుకొనే ఉంటుంది—”భావయుక్తంగా పలికింది.

మల్లి కాపురానికి రాగానే తను సూరిని పూర్తిగా మరిచిపోయాడు. పొద్దు మబ్బుల్లో ఉండగానే పొలం వెళ్లిపోతాడు. పగలంతా పొలంలో పనిచేసి పొద్దుక్రుంగగానే ఇంటి కొస్తాడు. చెమటలు స్రవించిన శరీరశ్రమతో ఇంటికి రాగానే మల్లి చూపే ఆదరణలో, అందిచ్చే ఆనందంలో సూరి మరుపు తెరమాటున ఉండిపోయింది. తన యౌవన జీవనస్రవంతి ఈరోజునే ప్రపంచం సుఖాల మీద విసిగి సాగరసంగమం కాబోయే నదిలా పరమాత్మలో లీనమయ్యే అంతిమ దినం. తనలో తొలిసారిగా ప్రేమబీజాన్ని నాటిన సూరిచెంతనే ఈయాల పానా లొదలాలి. కాళ్లు సూరి ఇంటి దగ్గర ఆగేయి. మెల్లగా తలుపు తట్టేడు.

“ఏంది బావా! ఈయాల బాట తప్పినావా ?” సూరి చిరునవ్వుతో పలకరించింది. “పాతబాట ఎలా మరిచిపోతా సూరీ—”అంటూ ఆమెని సమీపించబోయాడు.

“వద్దు బావా!దూరంగా ఉండు—”సూరి సూటిగా తన ఎదలో బల్లెం విసిరినట్లయింది.

“సూ .... రీ—”లాలనగా పిలిచేడు.

“నువ్వు నా ఇంటికి ఇటువంటి కోరికలకోసం రాకు! నీకూ, నాకూ ఉన్న ఆనాటి సంబంధం వేరు. ఇప్పుడు నేను కొత్త సూరిని. చేసిన పాపాలకి కన్నీళ్లతో కుమిలిపోతూ ఆ బగమంతుణ్ణి శరణు కోరుతున్న ఈ కొత్తజీవితంలో నాలోని పాత కోరికలు సచ్చిపోయాయి. వద్దు బావా .... మంచిగా బ్రతుకుతున్న నన్ను మళ్లా ఆ మలిన బాటమీదకి గుంజకు—”

“సూరీ....!” అతని నరాల్లో పొంగుతున్న రక్తం గొంతులో నవచైతన్యమిచ్చింది. “మల్లి నెన్నడు తోలుకొస్తావ్” .... సూరి వెనక్కి వెళుతూ ప్రశ్నించింది.

ఆ ప్రశ్నతో అతని రూపంలో దాగిన ప్రతిరూపం ముఖంలో ప్రవేశించింది. క్షణంలోనే ఆ ముఖంలోని వాంఛ, కళాకాంతులు అంతరించి దిగాలుపడిపోయాయి.

“నేను సచ్చిపోతున్నాను సూరీ .... !” దిగులుగా అన్నాడు.

“ఛా! అదేంమాట — ”సూరి కళ్లెర్రజేసింది.

“అవును సూరీ! మద్దనేల మోటకాడినుండి తిరిపాలాని కెళుతున్నా. ఆడ చేనుగట్టుమీద కోడెత్రాచు పడగిప్పి ఆడుతోంది. సీదా నా బాటని నేను పోక కట్టె పుచ్చుకొని కొట్టినా. రెండు దెబ్బలు తగలగానే కట్టె విరిగిపోయింది. పాము కలుగులో దూరిపోయింది. దెబ్బతిని పారిపోయిన నాగుపాము, కక్షకట్టిన శత్రువు ఇడిచిపెట్టరు సూరీ—నాకింక పానాలమీద నమ్మకంలేదు. నీ బావను కమించు. మల్లితో ఈమాట చెప్పు .... !”

అంటూ గుమ్మాలు దిగేడు “బావా—బావా!” అని పిలిచే సూరిపలుకులు అతని కింక వినిపించలేదు. తిన్నగా ఇంటి కెళ్లేడు. మల్లి తన ఒళ్లో తల పెట్టుకొని ముచ్చట్లు చెబుతున్నప్పుడు ఎవరైనా వస్తే హఠాత్తుగా లేచిపోయినట్లు ఇంట్లో గునగుసలాడుకొంటున్న ఎలుకలు చూరుమీదకి ఎగబ్రాకేయి. ఇల్లు బావురుమని విలపిస్తున్నట్లుంది. కుండలోని కూడు కంచంలో పెట్టుకొని కూర్చున్నాడు. ముద్ద నోట్లోకి పోవటం లేదు. లేచి చెయ్యి కడుగుకొని దీపం ముట్టించి మంచముమీద పడుకొన్నాడు. రోజూ తను మంచముమీద ఒరగగానే నిద్ర ఆవహించుకుంటూ వస్తుంది. ఈరోజు కళ్లు మూతలు పడటంలేదు. పాము తన అడుగుల పసికడుతూ బీబమ్మ ఒటేలుకాడికి వస్తాది. ఆడినుంచి సూరి ఇంటి కెళ్తాది. మళ్లా అడుగులు వాసన చూసుకొంటూ తనింటి కొస్తాది. తనని కాటేస్తుంది. తను సచ్చిపోతాడు. ఇదివరకో పాలి కన్నయ్య పాము కరిచే సచ్చిండంట. ఎవరి కేవిధంగా సావుందో? ఎవరికి భూమిమీద ఎన్నాళ్ల ఋణమో ? అతని

“ఒక్క పెళ్లాంతోనే మేము అంతా వేగలేకుండా ఉంటే, ఒక్కసారిగా ముగ్గురిని చేసుకున్నావు ఏంబావుకుందామనీ?” అని అడిగాడు ఒక ప్లీడరుగారు జైలుకి వెళ్ళిన తన క్లయింట్ ని.

“అబ్బే! ఏమీ లేదు. ముగ్గురితో నెగ్గగలనో లేదో చూద్దామనీ” నసిగాడు క్లయింట్.

ఏ. గోపాలరావు (మద్రాసు)

చూపులు అలా అలా ముందుకు పోయాయి. గుండె యథాస్థానంలో లేదు. గోడమీద ఏదో మెదలుతోంది. అటు యిటూ కదలుతోంది. అది పామే —ఆ పామే .... ! తనకి చావు తప్పదు. ఇంక తన ఆయువు ఘడియల్లో పూర్తవుతుంది. తన ఆకస్మికమరణం మల్లికి పిడుగుపాటులా — పరిణమిస్తుంది. సంసారసుఖాలని సంతృప్తిగా, సంతోషంగా అనుభవించని తన జీవితం మూన్నాళ్ల ముచ్చటా ? ఇరవై అయిదు సంవత్సరాలలోనే తన ఆయువు సంపూర్తి అయిందా ? తన జీవితంలో ఋణానుబంధం ఇంతవరకేనా ??? చూపులు ఆగోడమీదే నిలిచిపోయాయి. గ్రామదేవతకి కోళ్లని బలిచేసే గణాచారిలాగుందా కాలసర్పము.

2

ఒక్కొక్కప్పుడు ఊహలే స్వప్నాలుగా బహిర్గతం కావచ్చు. మరొకప్పుడు రానున్న భవిష్యత్తు సూచనప్రాయంగా కళ్లముందు కలగా కనిపించవచ్చు. కొన్ని కలలు నూటికి నూరుపాళ్లు నిజాలవుతాయి. కొన్ని కల్లలవుతాయి. బ్రతుకే కలవంటి ఒక కల్లయని గుర్తించినవారే భావిలో కూడా కలలు కనటం సహజం. సైదులు రాత్రి చాలాసేపు ఆలోచించి, విచారించి, తీరని వేదనతో, ఆరనిదిగులుతో, రగులుతున్న ఆత్రుతలో, ఎప్పుడో, ఎట్లో—తాత్కాలికంగా నిద్రాదేవతా ఒడిలోవాలేడు. సర్వసాధారణంగా పాము మంచము ఎక్కదని గాఢమయిన మూఢనమ్మకం. సైదులు విషయంలో అందుకు వ్యతిరేకంగా జరిగింది. పాము పైనుంచి తనమీద పడింది. కాటు వేసింది. ప్రాణభయంతో పారిపోయింది. పరులప్రాణాలు కబళించటం దానికి వినోదం. తన ప్రాణరక్షణ అత్యవసరం. సైదులు చచ్చిపోయాడు. మల్లి లబోదిబో మని మొత్తుకొంటోంది. నలుగురు మనుష్యులు అతన్ని మోసుకుపోయారు. ఆ సింతచెట్టుకాడ రెండు సమాధుల ప్రక్కగా మూడవసమాధి కూడ వెలిసింది. అంతా అంధకారం. ఆ అంధకారంలో అందమయిన మల్లి. కథ పూర్తయింది. కల కరిగిపోయింది. సైదులుకి మెలకువ వచ్చింది. తనింకా చచ్చిపోలేదని తెలుసుకొన్నాడు. మళ్లా ఆలోచనలు అనేక బాటలుగా చీలి, కేంద్రమయిన అతని మస్తిష్కంనుంచి విడివడుతున్నాయి. అంతలోనే ఎక్కడినుంచో అతనిమీద ఒక మెత్తటి పదార్థం పడింది. గుండె అమితవేగంతో కొట్టుకొంది. ఆ పడిన పదార్థంమీద దుప్పటి వేసి కంగారుగా లేచేడు. రెండు అంగలలో వెళ్లి కట్టె, దీపం తెచ్చేడు. ఆ పడినపదార్థం దుప్పటిలో గిలగిలలాడుతోంది. గజగజ వణుకుతున్న చేతులతో దుప్పటి తొలగించాడు. అది ఒక ఎలుకపిల్ల. భ్రాంతిలో, అవివేకంగా తను చేసిన పనికి తనకే నవ్వు వచ్చింది. కాలమానాన్ని సూచిస్తూ ఇంటి ముందు తొలికోడి కూసింది. హేతువు లేకుండానే ఆకాశం మీద తీతువుపిట్టలు కూస్తూ ఎగిరిపోతున్నాయి. పొలాల్లోని నక్కలు సన్నాయిరాగం పట్టినట్లు కూస్తున్నాయి. నాట్యానికి మేళ, తాళ, గాన వాద్యాల్లా ప్రకృతిదేవత ప్రళయతాండవానికి ఆ నిస్సంచార, నిశ్శబ్ద, నిశీధిలో కీచురాళ్ల రొదలు, గజ్జెల పురుగుల ధ్వనులు, కప్పల బెకబెకలు శృతికలుపుతున్నాయి. సైదులు కింక నిద్రపట్టలేదు. చుట్ట వెలిగించి మంచముమీదే పడుకొని కాలుస్తున్నాడు. క్షణమొక యుగంగా గడుస్తోంది. మలికోడి కూసింది. ఒక రెండెడ్ల బండి తన ఇంటివేపు వస్తున్నట్లనిపించింది. ఎద్దుల మెళ్లోని గంటలు అంతకంతకి దగ్గరగా వినబడుతున్నాయి. బండి ఇంటిముందు ఆగింది. ఎవరో దిగేరు. తట్టిన తలుపుమీద మల్లి చేతిగాజులు ఘల్లున మ్రోగేయి. ఒక్క ఉదుటున వెళ్లి తలుపు తీశాడు. తన రక్తాన్ని పంచుకొని, మల్లి రూపాన్ని మలచుకొన్న మూడునెలల ముద్దుబిడ్డడు తండ్రి చేతిలో వాలిపోయేడు.

* * *

బండి తోలుకొచ్చిన పాలేరు వీథిలో అరుగుమీద కూర్చొని చుట్ట ముట్టించేడు. మల్లి మెల్లిగా తలుపు వేసివచ్చి మంచముమీద అతని ప్రక్కగా కూర్చొంది. పిల్లవాడు మంచము

"ఆంధ్రసచిత్రవారపత్రిక లో
ప్రకటనలు మీవ్యాపారాభివృద్ధికి
తోడ్పడుతాయి.

తరచుగా మూత్రవిసర్జన

చక్కెరతో గాని, చక్కెర లేకుండగాని తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైన చిహ్నము. శరీరాన్ని శుల్ల చేయడమే కాకుండా ఈవ్యాధి, తనబంధలో చిక్కినవారిని ఆరోజా కారోజు మృత్యువుకు ఆసన్నని చేయును. ప్రథమదశలో శారీరక మానసిక శ్రమలకు యిచ్చగించకుండుట, నడుములో నొప్పి, చూపుమాంద్యము, తొడల్లో తిమ్మిరి, నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతో కూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో, అధికదాహం, ఆకలి, గొంతు నోరు ఎండుట, దురదలు, కాళ్ళలో పగుళ్ళు, తూకం తగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్ళ నొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు, రాచపుండ్లు, ఇట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును.

"వీనస్ ఛారమ్" మాత్రలు వాడి అనేకవేలమంది తమబాధలనుండినివారణపొంది మృత్యుకరాళమునుండి రక్షింపబడిరి. "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద ప్రాచీన యునాని వైద్యవిధానం ప్రకారం అమూల్య ఓషధుల శాకపదార్థముల,స్వాభావిక క్షారముల సారముతో తయారైనవి. "అమిత దాహము, మూత్రంలో చక్కెర తగ్గి పలుమారు మూత్ర విసర్జనచేయుఅవసరము 2లేక 3 రోజులలోనే మీకు చాలాభాగము నివారణయగును. కొద్ది రోజులలోనే మీకు సగానికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయములో సుఖముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు. నిరాహారముతో నుండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై ఇదివరకటి కంటే ఎక్కువ రకాల ఆహారపదార్థములు తినవచ్చును. వివరములుగల ఇంగ్లీషుకరపత్రములు అడిగినవారికిఉచితముగా పంపబడును. 50 బిళ్ళలఖరీదు రు.6-75న.పై. మాత్రమే. పోస్టేజినిమిత్తం రు. 1-6 న. పై. అదనం. (ఒకేసారి రెండు, అంతకుపైగా సీసాలను తీసికొన్నచో పోస్టేజి ఉచితము.)

(SELLING AGENTS)
Barrys Commercial Corporation
(A. P. W)
27/A, Dhurumtollah Street
CALCUTTA-13.

మూడవ సమాధి

మీద విశ్రాంతిగా నిద్రపోతున్నాడు. కుశలవార్తలు, కులాసాకబుర్లు పూర్తయినతరువాత :

"నిజంగా నిన్ను సూత్తా ననుకోలేదు మల్లీ...." అన్నాడు.

"ఎందుకట్టా .... ?"

అతను జరిగినదంతా చెప్పేడు.

"నేను అదృష్టవంతురాలిని....!" అని మంగళసూత్రం కళ్లకద్దుకొంది.

మంచముమీద విశ్రాంతిగా నిద్రపోతున్న పసికందు ఊహాలుతెలియని శైశవంలోకూడ ఎందుకో నవ్వుతున్నాడు. సైదులు అతన్ని తదేకంగా చూస్తున్నాడు.

"ఏందిగట్టాసూత్తావ్....?" మల్లిమెల్లగాఅంది.

"నీ రూపే ...." సైదులు గొణిగేడు.

"రంగో .... ?"

"నాకుమల్లే ఉన్నాడు. నీ రూపు, నా రంగు."

"పోదూ ...." సిగ్గుతో మందలించింది.

సైదులు తన ముద్దుతనయుని నిర్నిమేషంగా చూస్తున్నాడు. మనసులో ఆలోచనలు ధూమశకటాల్లా పరుగు లిడుతున్నాయి. ఆ అదురుష్టమంతా మల్లి మంగళసూత్రానిది కాదు. తన బాబు పుట్టిన వేళా విశేషం. "ఇదిగో మల్లీ....!" ఆలోచనలనుంచి తేరుకుంటూ పిలిచేడు.

"ఏందంట."

"మన బాబుకి ఏం పేరెడదాం ?"

"నీ యిష్టం."

"నాగరాజు అని పెడదాం."

"ఎందుకని .... ?"

"అబ్బాయి అదురుట్టంవల్లనే నే నీవేళ బచాయించాను. అందుకని నాగరాజు పేరెడదాం ....!"

"గట్టనే ....!" అంది మల్లి.

ఆమెని—గుండెల కదుముకొన్నాడు.

3

రోజంతా చీకటే రాజ్యము చేయదు. సుఖదుఃఖాలలో డోలాయమానంగా ఊగులాడే మానవులని రోజాలు, ఋతులు అనుసరిస్తూ ఉంటాయి. కారుమబ్బులని తొలగించుకొని కరుణాకరుడయిన దినకరుడుదయించినట్లు మల్లి ఆగమనంతో సైదులు భీతి అంతరించి, ముఖాన దరహాస రేఖలు వెల్లివిరిశాయి. కబుర్లతో, పరాచికాలతో భళ్ళున తెల్లవారింది. మల్లి లేచి గృహకృత్యాలలో అడుగుపెట్టింది. సైదులు నిద్రలేని కళ్లతో మంచముమీద ఒరిగేడు. కుంభకర్ణుడి వారసులనందరినీ మేల్కొల్పటానికి బయట కాకులన్నీ కట్టుగా కలసి రణగొణధ్వని చేస్తున్నాయి. జనసందోహాలు మారుమ్రోగుతున్నాయి. పల్లెటూరి వాతావరణానికి అది ప్రతిబింబమే కాబట్టి సైదులికి ఏమంత కొత్తగా అనిపించలేదు. అప్పుడప్పుడే చిన్నగా, సన్నగా కునుకుపడుతోంది. ప్రక్కింటి పెద్దులు వచ్చి :

"సైదులూ....సైదులూ....!" అని పిలిచేడు.

"ఏందిరా కొంప మునిగిపోయినట్టు గట్టా పిలుస్తుండావ్!" అని విసుక్కొంటూ తలుపు తీసేడు.

"ఇప్పుడింకా తొంగి నిద్రోతున్నావా ?"

"ఏమాయె .... ?"

"అనసూరి సచ్చిపోయిందిరా....!" అని పెద్దులు పరుగు తీశాడు.

సైదులు గుండెల్లో వెయ్యి రైళ్లు ఇంజన్లు ఒక్కసారిగా కూతపెట్టినట్లయింది. పెద్దులు అబద్ధం పలకడు. అందులోనూ ప్రత్యేకంగా పొద్దున్నే అబద్ధమాడవలసిన పనిలేదు. రాత్రి చిరునవ్వుతో పలకరించిన అనసూరి తెల్లవారేసరికి మృత్యువుకి బలి అయిందా ? సైదులు తన చెవులని తానే నమ్మలేకపోతున్నాడు. ఆ సమయంలో తన ఇల్లొక నరకకూపంలా కనిపిస్తోంది. రెండు అంగల్లో అనసూరి ఇల్లు సమీపించాడు. అక్కడ జనం గుమిగూడి ఉన్నారు. అందరూ తలోకరకంగానూ మాట్లాడుతున్నారు. ఇంటి ముందు అనసూరి శవం పడిఉంది. నిద్రపోతున్నట్లు ఆమెకళ్ళు మూసుకొని ఉన్నాయి. తన వెళ్లిపోయేటప్పుడు అనసూరి పిలిచింది. అప్పుడు తను వినిపించుకొని ఆమెపిలుపుని అందుకున్నట్లయితే ఇలా ఆకస్మికమృత్యువువాత పడేది కాదేమో ? హిమగిరిశిఖరాలనుంచి కరిగి, జారిన మంచుమంచి స్రవించే గంగోత్రిలా అతని కళ్ళ అశ్రుబిందువులు ద్రవిస్తున్నాయి. మరల అనసూరివంక చూసేడు. ఆమెకి కొంచెం దూరంలో ఒక కర్ర, దానికి కొంచెం దూరంలో చచ్చిన పాము పడిఉన్నాయి. ఆమె మరణానికి అవి రెండే సాక్ష్యాలు. వాటికి కారకుడు తనే. అనసూరి ఎంత పని చేసింది ? స్వల్పవిషయాలకికూడ స్వార్థంతో విలువకట్టే యీ మానవసమాజంలో మరొక ప్రాణికోసం మరువలేని మహత్తరత్యాగం చేసింది. కసితో, పగబట్టిన వ్యక్తిని నుసిచేయాలనే తలంపుతో, జరజర ప్రాకుతూ వచ్చిన కాలసర్పాన్ని ప్రతిఘటించి, సదాశయసఫలతకై తన ప్రాణాలనే బలిచేసింది. ఆమె మానవస్త్రీ కాదు. దేవత. నిన్ను చూస్తుంటే సినిమాలో చూసిన ఆ హీరో యాదు కొస్తున్నాడు అంటూ తన బాహుపంజరంలో బంధితురాలయిన అనసూరి ఈమేనా ? —తప్పు బావా ! నీ మాటకి సోర్థం లేదు. నాకు కావలసిం దొకటే— నీ సుఖమే నా క్కావాలి. ఈ మాటని—మరచిపోతావా ? అని జాలిగా ప్రశ్నించిన అనసూరి. నువ్వు నా ఇంటికి క్షణికమయిన కోరికలకోసం రాకు. నీకూ నాకూ ఉన్న ఆనాటి సంబంధం వేరు. ఇప్పుడు నేను కొత్తమారిని. చేసిన పాపాలకి కన్నీళ్లతో కుమిలిపోతూ ఆ బగమంతుణ్ణే శరణుకోరుతున్న ఈ కొత్తజీవితంలో నాలోని పాత కోరికలు సచ్చిపోయాయి. వద్దు బావా ! మంచిగా బ్రతుకుతున్న నన్ను మళ్లా ఆ మలినబాటమీదికి గుంజకు — అనసూరి విరక్తిగా పలుకుతోంది. సైదులు కళ్లముందు అనసూరి రూపం అనేక భంగిమలలో కనిపిస్తోంది. ఎవరు, ఎప్పుడు, ఎలా మరణిస్తారో అనేది నిర్ణయించలేని సమస్య. ఎవరికి ఎన్నాళ్ళ ఋణమో ?

* * *

ఆ రోజంతా సైదులు భోజనం చేయలేదు. అనసూరి అంతిమక్రియలు తనే జరిపించాడు. ఆ సింతచెట్టుక్రింద, రెండు సమాధుల పక్కగా మరొక సమాధి వెలసింది. ★